ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 6
సంపుటి : 3
సంచిక : 792

సోమవారం 29 ఏప్రిల్ 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## విల్ జాక్స్ విధ్వంసం

సిక్సర్లతో గుజరాత్‌ను ముంచిన ఆర్సీబీ బ్యాటర్

201 టార్గెట్‌ను 16 ఓవర్లలోనే ఊదేసిన బెంగళూరు

రాణించిన కోహ్లీ

.. వివరాలు 2లో




# మోదీకి ఓటేస్తే దేశాన్ని తాకట్టు పెడతారు

### రిజర్వేషన్లు రద్దు చేస్తే ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తారు

పాలమూరు-రంగారెడ్డికి జాతీయహోదా ఎందుకు ఇవ్వలేదు?

కాజీపేట, బయ్యారం ఫ్యాక్టరీలు, ఐటీఐఆర్‌ను ఎందుకు రద్దు చేశారు?

జవాబులు చెప్పాకే ప్రధాని మోదీ తెలంగాణకు రావాలి

దేవుడి ఫొటో చూపి అడుక్కునే వాళ్లలాగ బీజేపోళ్లు ఓట్లడుగుతున్నరు

బీజేపీ-బీఆర్ఎస్ చీకటి ఒప్పందం.. మేడ్చల్ ఎమ్మెల్యే మాటలే సాక్ష్యం

మల్కాజిగిరి నియోజకవర్గ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

**ప్రధాని నరేంద్రమోదీకి ఓటేస్తే రైల్వేను, ఎల్ఐసీని అదానీ, అంబానీలకు అమ్మేస్తారని.. కాబట్టి, ఆయా సంస్థల్లో పని చేసే వారికి ఉద్యోగాలు ఉండాలంటే మోదీ ఉద్యోగాన్ని ఊడగొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోదీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని హెచ్చరించారు. రిజర్వేషన్లు లేకుండా చేసి దేశాన్ని అదానీ, అంబానీలకు తాకట్టు పెడతారని విమర్శించారు.**

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 : రైల్వేలు, ఎల్ఐసీ, ఎయిర్‌పోర్టు, బీఎసఎన్ఎల్, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఐడీపీఎల్, డిఫెన్స్ ఫ్యాక్టరీలను తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగాలను కాంగ్రెస్ కల్పించిందని, ఆ సంస్థలను అందులో ఉద్యోగాలను కాపాడుకోవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు.
ఆదివారం మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో సీఎం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వనస్థలిపురం, కౌకుర్‌ల వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ప్రసంగించారు.
తెలంగాణకు వస్తున్న నరేంద్రమోదీ.. రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేస్తున్నారో జవాబు చెప్పి రావాలని సీఎం నిలదీశారు.
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి

మిగతా 2 లో





# కేంద్రంలో చక్రం తిప్పేది మనమే

## పేగులు తెగేదాకా కొట్లాడేది మనమే

జైళ్లకు.. తోకమట్టకు నేను భయపడతానా?

భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదా??

నా గుడ్లు పీకుతాడట.. చెడ్డీ లాక్కొంటాడట ఇదేనా సీఎం మాట్లాడే భాష?

వరంగల్ రోడ్ షోలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్

తరలించే కుట్ర.. మోదీపై ఫైర్

**'కేంద్రంలో వచ్చేది హంగ్.! ఏ పార్టీకి మెజారిటీ వచ్చే అవకాశం లేదు..! హంగ్ వస్తే.. మనమే కింగ్ అవుతాం. నరేంద్ర మోదీకి 200 సీట్లకు మించి రావు. ఈ మోకా(అవకాశం)లో తెలంగాణలో 14-15 ఎంపీ సీట్లిస్తే.. పేగులు తెగేదాకా కొట్లాడేది మనమే" అని బీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల చంద్రశేఖర్రావు అన్నారు.**

వరంగల్, ఏప్రిల్ 28 : కేంద్రంలో కీలకంగా మారితే.. తెలంగాణ హక్కుల కోసం కొట్లాడవచ్చని వ్యాఖ్యానించారు. ఆదివారం రాత్రి ఆయన హనుమకొండ చౌరస్తాలో జరిగిన బీఆర్ఎస్ రోడ్ షోలో మాట్లాడారు. గోదావరి నీళ్లను తమిళనాడు, కర్ణాటకకు తర లించేందుకు ప్రధాని మోదీ కుట్రలు చేస్తున్నారని, ఆ మేరకు నోటీసులు

మిగతా 2 లో




### శ్రీరాముడు బీజేపీ ఎంపీనా.. లేక బీజేపీ ఎమ్మెల్యేనా

రాముడిని దేశానికి పరిచయం చేసినట్లుగా బీజేపీ నేతలు ప్రచారం

బీజేపీపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండటంతో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటున్నారు. మ-రోసారి బీజేపీ, కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. దేవుడైనా రాముడిని బీజేపీ నేతలు రాజకీయాల్లోకి తీసుకొచ్చి లబ్ధి పొందేలా ప్లాన్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి దానికి రాముడిని తెరమీదకు తీసుకువస్తున్నారని చెప్పారు. రాముడు ఏమైనా బీజేపీ ఎంపీనా, లేక బీజేపీ ఎమ్మెల్యేనా అని

మిగతా 2 లో

# భయాందోళనలు సృష్టించి లబ్ధి పొందేందుకు రాజకీయ డ్రామా

## రిజర్వేషన్ లపై కాంగ్రెస్ కాలకూటవిషం చిమ్ముతోంది

గ్యారంటీల అమలుపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు డ్రామాలు

అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమా నించింది,

రిజర్వేషన్ లకు తూట్లు పొడిచింది కాంగ్రెస్ పార్టీయే

మతపరమైన రిజర్వేషన్లను మా త్రమే బిజెపి రద్దు చేసి తీరుతుంది

స్వదేశీ బీజేపీకి, విదేశీ కాంగ్రెస్కు మధ్య జరుగుతున్న పోరాటమిది

ఎస్సీ, ఎస్టీలకు పారిశ్రామివేత్తలను చేయడమే మోదీ సర్కార్ లక్ష్యం

హుజూరాబాద్ లో ఇంటింటికీ బీజేపీ పేరుతో సంజయ్ ఎన్నికల ప్రచారం

**బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేస్తారం టూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. బిసి, ఎస్సీ, ఎస్టీల్లో భయాందోళనలు స్రుష్టించి రాజకీ య లబ్ది పొందడానికి కాంగ్రెస్ చేస్తున్న విష ప్రచారంలో భాగమే సీఎం రేవంత్ వ్యాఖ్యలని అన్నారు.**

హుజూరాబాద్ ఏప్రిల్ 28 : వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆగ్రహంతో ఉండటంతో వారి ద్రుష్టిని మళ్లించేందుకు ఆడుతున్న రాజకీయ డ్రామా అని విమర్శించారు. రాజ్యాంగాన్ని తూ.చ తప్పకుండా అమలు చేసే పార్టీ బీజేపీ అని, ఎస్సీ,

మిగతా 2 లో





### నవాబులు, నిజాంలపై ఈగ కూడా వాలనీయరు..

#### రాహుల్‌పై మోదీ విసుర్లు

**కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు (రాహుల్) దేశాన్నేలిన రాజులు, మహారాజులను అగౌరపరుస్తూ, నవాబులు, నిజాంలు, బాద్‌షాలపై అకృత్యాలపై మాత్రం నోరు మెదపరని విమర్శించారు.**

అనేక హిందూ దేవాలయాలను ధ్వంసం చేసిన ఔరంగజేబ్‌ను కాంగ్రెస్ పార్టీ ఏనాడూ విమర్శించిన పాపన పోలేదని అన్నారు. కర్ణాటకలోని బెళగవిలో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడుతూ, ఇండియానేలిన రాజులు అకృత్యాలు చేసి పేద ప్రజల ఆస్తులు కొల్లగొట్టారని కాంగ్రెస్ షెహజాదా (రాహుల్) చెబుతుంటారని, సుపరిపాలన, దేశభక్తికి ప్రతీకలైన ఛత్రపతి శివాజీ మహరాజ్, రాణి

మిగతా 2 లో



# ఎండలతో బీకేర్ ఫుల్

అవసరమైతేనే బయటకు రావాలి

45 డిగ్రీల ఉష్ణోగ్రతకు పైమాటే

ఇప్పటికే అధికారుల హెచ్చరికలు

మీరు ఇళ్ల నుంచి బయటికి వెళ్తున్నారా? బీ కేర్‌ఫుల్!. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి కాలు బయటపెట్టకండి. ఎందుకంటే, తెలుగురాష్ట్రాలకు రెడ్ వార్నింగ్ ఇచ్చింది వాతావరణశాఖ. మరో 3 రోజులపాటు ఎండలు మండిపోతున్నాయని హెచ్చరించింది ఐఎండీ.. తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండ వేడికి జనాలు ఒక్కరి బిక్కిరి

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 ఏప్రిల్
2024





# మోదీకి ఓటేస్తే దేశాన్ని తాకట్టు పెడతారు



**మొదటి పేజీ తరువాయి**

జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదో.. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ప్రాజెక్టులను ఎందుకు రద్దు చేశారో ఈ ప్రాంత ప్రజలకు సమాధానం చెప్పాలని, ఆ తర్వాతే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణ ఏర్పాటును తప్పుబట్టిన మోదీ ఏవిధంగా ఓట్లు అడుగుతారని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీవాళ్ల మాటలు చూస్తే మూడు ఎడ్లు.. 36 దొడ్లు అన్నట్లుగా ఉందని విమర్శించారు. మతాన్ని అడ్డం పెట్టుకొని ఓట్లు కొల్లగొట్టి దేశంలో అధికారంలోకి రావాలని
చూస్తున్నారని, పదేళ్లలో చేసిందేదో చెప్పాలని అన్నారు. రాష్ట్రం నుంచి బీజేపీని బహిష్కరించాల్సిన బాధ్యత తెలంగాణ యువత మీద ఉందన్నారు.

**గుండు రాలే.. బండి రాలే!**

2021లో వరదలు వచ్చినప్పుడు మూసీ పరివాహక ప్రాంతమంతా మునిగిందని, ఆనాడు బీజేపీ అధ్యక్షుడు బండిపోతే బండి అని, గుండు పోతే గుండిస్తానన్నాడని, కానీ, గుండు రాలే.. బండి రాలేదని, అరగుండు వచ్చి ఓట్లు అడుగుతున్నాడని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నయా పైసా తీసుకురాలేదన్నారు. మెట్రో ఎందుకు ఇవ్వలేదంటే జైశ్రీరామ్ అంటున్నారని, బయ్యారం ఉక్కు ఎందుకు ఇవ్వలేదంటే హనుమాన్ జయంతి చేశామంటున్నారని తెలిపారు. మన తాతల ముత్తాతల నుంచే శ్రీరామనవమి తదితర పండుగలు చేశామని, ఎల్లమ్మ, పోచమ్మలకు కోళ్లు కోశామని, కల్లు పోశామని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. దేవుని ఫోటో చూపి రోడ్ల మీద అడుక్కునే మాదిరిగా బీజేపీవాళ్లు ఓట్లు అడుక్కుంటున్నారని విమర్శించారు.

**పదేళ్లలో ఏం చేశారో చెప్పకుండా..**

కేసీఆర్ పదేళ్లు సీఎంగా ఉండి ఏమి చేశారో చెప్పుకోకుండా, వంద రోజుల్లో ఐదు గ్యారంటీలను అమలు చేసిన తమను తిట్టుకుంటూ తిరుగుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. విడివిడిగా వస్తే నెగ్గలేమని అర్థం చేసుకున్న బీజేపీ, బీఆర్ఎస్ చీకట్లో చేతులు కలిపాయని.. అందుకనే మల్కాజ్‌గిరిలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తున్నారంటూ మేడ్చల్ ఎమ్మెల్యే (మల్లారెడ్డి) అందరి ముందే చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్ పక్కన కూర్చొని మంత్రిగా చేసిన ఈటల రాజేందర్ కూడా రాష్ట్రంలో జరిగిన దుర్మార్గాలకు బాధ్యుడేనని, పంపకాలలో తేడా వచ్చి బయటకొచ్చాడని రేవంత్ విమర్శించారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చనందుకే ఆ తర్వాత ఈటలను అక్కడి ప్రజలు ఓడగొట్టారన్నారు. ఆనాడు కొడంగల్‌లో కేసీఆర్ కక్ష గట్టి తనను ఓడిస్తే మల్కాజ్‌గిరి నుంచి ప్రశ్నించే గొంతుకగా ఎంపీగా గెలిపించారని, తాను సీఎం కావడానికి నాడు మల్కాజ్‌గిరి ప్రజలిచ్చిన ప్రోత్సహమే కారణమని రేవంత్ తెలిపారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, చంద్రాయణ్‌గుట్ట, పీ7రోడ్డు ద్వారా ఎయిర్‌పోర్టుకు మెట్రో రైలును విస్తరించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

**భూ యజమానితోపాటు.. కౌలురైతుకూ భరోసా**
**గ్రామసభల ద్వారా కౌలురైతుల గుర్తింపు**
**ఎడ్యుకేషన్ పాలసీపై కమిషన్: రేవంత్**

కౌలు రైతుతోపాటు ఆ భూమి యజమానికీ రైతు భరోసా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరికి ఇవ్వాల్సింది వారికి వేర్వేరుగా ఇస్తామని చెప్పారు. ఒకరికి ఇచ్చి ఇంకొకరికి ఎగ్గొట్టేది లేదని స్పష్టం చేశారు. గ్రామ-సభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తిస్తామని, ఆయా గ్రామాల్లో కౌలు రైతుల జాబితాలను పంచాయతీల్లో పెట్టి.. అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియనంతా పారదర్శకంగా చేస్తామని, ఇందుకు సంబంధించిన విధివిధానాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పెడతానని అన్నారు. ఆదివారం ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 92 శాతం మంది రైతులు 3 ఎకరాల లోపు భూమి ఉన్నవారేనని సీఎం చెప్పారు. ఐదెకరాల పైబడి భూమి ఉన్నది 4 లక్షల కుటుంబాలకేనన్నారు. నాలుగేళ్లపాటు అందరూ కలిసి కొట్లాడితేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, కేసీఆర్ చేసిన కష్టానికి వంద తరాలకు సరిపోయేంత కూలి ఆయనకు గిట్టుబాటైందని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు జాతిపిత కేసీఆర్ కాదని, ప్రొఫెసర్ జయశంకర్ అని చెప్పారు.

ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని బీఆర్ఎస్, బీజేపీ కుట్ర చేస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 లక్షల మంది యువత వారి భ్రమలను తొలగింపజేస్తారని హెచ్చరించారు. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కూడా కాకముందే కూలగొడతామని బయలు దేరారని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నుంచి కొందరు వచ్చి తమతో కలిసి నడుస్తామని చెప్పారని వెల్లడించారు. అయితే క్లీన్ ఇమేజ్ ఉన్నవారిని, పద్ధతి గలవారినే కాంగ్రెసలోకి తీసుకుంటున్నామని చెప్పారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలన్నదానిపై తనకు స్పష్టత ఉందన్నారు. రిజర్వేషన్లు ఎత్తివేయడమనేదే బీజేపీ కోర్ ఎజెండా అని రేవంత్ పునరుద్ఘాటించారు. తాము రాష్ట్ర ఆదాయాన్ని పెంచి.. ప్రజలకు పంచుతామని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తే ఆదాయం, ఉపాధి పెరుగుతాయన్నారు. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై కమిషన్ వేస్తామని చెప్పారు. ఇక సచివాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దండ వేయకపోవడంపై సీఎం స్పందిస్తూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఏది చేసినా సీఎస్, డీజీపీలే చేయాలని అన్నారు. సీఎస్ ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసినందున తాము అక్కడికి వెళ్లి దండ వేశామని తెలిపారు. శ్రీరామనవమి రోజు భద్రాచలంలో పట్టువస్త్రాలు కూడా సీఎస్సే సమర్పించారని గుర్తు చేశారు.

# భయాందోళనలు సృష్టించి లబ్ధి పొందేందుకు రాజకీయ డ్రామా

**మొదటి పేజీ తరువాయి**

ఎస్టీ, రిజ ర్వేషన్లను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మతపరమైన రిజర్వేషన్ల కు రాజ్యాంగం వ్యతిరేకమైనప్పటికీ సుప్రీంకోర్టు తీర్పులను సైతం ధిక్క రించి ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. బీజేపీ అధికారం లోకి వస్తే రాజ్యంగం ప్రకారం ము స్లిం రిజర్వేషన్లను రద్దు చేసి వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు అగ్రవర్ణా ల్లోని పేదలకు పంచి తీరు తామని ప్రకటించారు. రాజ్యాంగాన్ని మారు స్తామని కేసీఆర్ ప్రకటిస్తే కనీసం నో రు మెదపని కాంగ్రెస్ నేతలు అంబే ద్కర్ ను అడుగడుగునా అవమానిం చారన్నారు. అంబేద్కర్ ను ఓడిం చడంతోపాటు అంబేద్కర్ చనిపోతే ఆయన పార్థివ దేహాన్ని ఢిల్లీలో ఉం చకుండా ముంబయికి పంపించి న నీచమైన పార్టీ కాంగ్రెస్సేనని మండి పడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగం గా ఆదివారం ఉదయం హుజూ రాబాద్ విచ్చేసిన బండి సంజయ్ 'ఇంటింటికీ బీజేపీ' పేరుతో ఇంటిం టికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తూ కరప్రతాలను అందజేశారు. మోదీ ప్రభుత్వ విజయాలను వివరిస్తూ,. మళ్లీ మోదీయే అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే...ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 'ఇంటింటికీ బీజేపీ' పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా హుజూరాబాద్ లో నేను ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించా ను. మోదీ ప్రభుత్వ విజయాలను, ఎంపీగా చేసిన అభివృద్ధి, ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నాం. కాంగ్రెస్, బీఆర్ ఎస్ ఏనాడూ ప్రజల కోసం పనిచే యలేదు. ప్రజలు కష్టాల్లో ఉంటే భరోసా ఇవ్వలే. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ ఏనాడూ జనం గురించి పట్టించుకోలేదు. లేఖలు రాసుడు, హైదరాబాద్ లో ఉండటం తప్ప సాధించిందేమీ లేదు. కరీంన గర్, వరంగల్, ఎల్కతుర్తి, సిద్దిపేట రోడ్డు విస్తరణ నిధులు ఎవరి హయాంలో వచ్చాయి? ఎవరి హయాంలో మోదీ వచ్చి పనులను ప్రారంభించారు. ఎవరి హయాంలో పనులు శరవేగంగా జరుగుతున్నా యో ప్రజలకు తెలియదా? అసలు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తెల్వదు. నేను పక్కా లోకల్. బీఆర్ఎస్ అభ్యర్థి పక్కా నాన్ లోకల్. కరీంనగర్ కు కేంద్రం ఇచ్చిన నిధులను కేసీఆర్ దారి మళ్లిస్తే నోరు విప్పలే. కరీంనగర్ ప్రజలు బాధల్లో ఉంటే ఏనాడూ పట్టించుకోలే. కేసీఆర్ కు దోచి పెట్టడం, తన కుటుంబానికి దాచి పెట్టడం తప్ప సాధించిందేమీ లేదు.. అకాల వర్షాలతో రైతులు పంట నష్టపోతే ఎన్నడైనా కేసీఆర్ ను కలిసి సాయం చేయించారా? ఇప్పుడు కూడా రైతులు పంట నష్టపోయి కొందరు, వడ్లు కొనుగోలు కేంద్రాల్లో మరికొందరు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు లేఖలు రాయలేదు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ప్రజలకు తెలియదు. మీడియాకు అయినా తెలుసా? కాంగ్రెస్ నేతలకు కూడా తెల్వదు. రాహుల్ గాంధీని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధాని చేయాలను కుంటే ఆయన మాత్రం సీఎం చేయాలనుకుంటున్నడు.. అసలు ఆయన లోకలా, నాన్ లోకలా, కూడా తెల్వదు. ఆ పార్టీ కార్యకర్తలే పూర్తి అయోమయంలో ఉన్నరు. ఈ విషయం తెలిసే కాంగ్రెస్ నేతలు నన్ను తిట్టి, రాముడి అక్షింతలను వివాదం చేసి రాజకీయ లబ్ది పొందా లనుకుంటున్నరు. నేను ప్రజల కోసం కొట్లాడిన. వందల కేసులు పెట్టినా భయపడలే. జైలు కు పోయిన. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులెన్నడైనా పోరాటాలు చేశారా? ప్రజల పక్షాన కొట్లాడి దెబ్బలు తిన్నరా? జైలుకు పోయారా? ..కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను ఎందుకు అమలు చేయలేదు? మహిళలకు నెలనెలా రూ.2500 లు ఇచ్చారా? రైతులకు రూ.500 బోనస్ ఇచ్చారా? ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా ఇచ్చారా? ఇల్లు లేనోళ్లకు ఇంటిజాగా, రూ. 5లక్షలిచ్చారా? విద్యార్థులకు రూ. 5లక్షల భరోసా కార్డు ఇచ్చారా? వృద్ధులు, వితంతవులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నారా?... మరి ఏం చూసి కాంగ్రెస్ కు ఓటేయాలి. అందుకే కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సైతం జెండాలు, ఎజెండాలను పక్కనపెట్టి ఈసారి మోదీ ప్రభుత్వం రావాలి. పచ్చి అబద్దా లాడుతోంది. ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడం పూర్తిగా పేదలను మోసం చేయడమే. అంబేద్కర్ ను అవమానించిందే కాంగ్రెస్. ఆ పార్టీ విదేశీ పార్టీ. బ్రిటిషోడు స్థాపించిన పార్టీ. బీజేపీ స్వదేశీ పార్టీ. గాంధీ ఆలోచనలను, అంబేద్కర్ ఆశయాలను, దీన్ దయాళ్, శ్యామా ప్రసాద్ ముఖర్జీ సిద్దాంతాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ.ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని అవమానించింది కాంగ్రెస్. అంబేద్కర్ ను అడుగడు గునా అవమానించింది కాంగ్రెస్. అంబేద్కర్ ను కుట్రలు చేసి ఓడించి పరాభవించిన పార్టీ కాంగ్రెస్. చివరకు అంబేద్కర్ చనిపోతే ఆయన పార్థివదేహాన్ని ఢిల్లీలో కాకుండా ముంబయికి పంపించింది కాంగ్రెస్. మతపరమైన రిజర్వేషన్లకు రాజ్యాంగం వ్యతిరేకమైనప్పటికీ, ముస్లిం రిజర్వేషన్లను తెచ్చి రాజ్యాంగాన్ని అవమానించిన పార్టీ కాంగ్రెస్. గతంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు కేటాయించిన ఖాళీల్లో అర్హులు లేకుండా కాంగ్రెస్ హయాంలో జనరల్ కేటగిరి అభ్యర్థులతో నింపి రిజర్వేషన్లను తూట్లు పొడిచిన పార్టీ కాంగ్రెస్. కానీ ఎస్సీ, ఎస్టీ లకు కేటాయించిన రిజర్వేషన్లు వాళ్లకే చెందాలని పకడ్బందీగా చట్టం తెచ్చిన పార్టీ బీజేపీ. దళితులను ఏటా 1.25 లక్షల మంది పారిశ్రామికవేత్తలుగా మారుస్తూ ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారిగా తీర్చిదిద్దుతున్న ఏకైక పార్టీ బీజేపీ. విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ ల కోసం ఒక్క ఏడాదిలోనే రూ.59 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం మోదీదే. రామ్ నాథ్ కోవింద్, ద్రౌపది ముర్మును రాష్ట్రపతి చేసిన పార్టీ బీజేపీ. రాజ్యాంగాన్ని తూ.చ తప్పకుండా అమలు చేస్తోంది బీజేపీ.. రాజ్యాంగానికి తూట్లు పొడిచింది కాంగ్రెస్.
కాంగ్రెస్ పార్టీ జిన్నా ఆలోచనలను అమలు చేస్తోంది. సుప్రీంకోర్టు వద్దన్నా మతపరమైన రిజర్వేషన్లు తెచ్చి పేదల పొట్టకొట్టింది కాంగ్రెస్. రాజ్యాంగాన్ని మార్చేస్తామని కేసీఆర్ ప్రకటిస్తే నోరు మెదపని పార్టీ కాంగ్రెస్. ఆనాడు కేసీఆర్ పై తిరుగుబాటు చేసి పోరాడింది బీజేపీ. పోడు భూములపై పోరాడింది బీజేపీ. దళిత సమస్యలపై పోరాడింది బీజేపీ.
అమిత్ షా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి పేదలకు అందజేస్తామని ప్రకటిస్తే... కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో ముస్లిం అనే పదాన్ని తొలగించి రిజర్వేషన్లనే రద్దు చేస్తామన్నట్లుగా అమిత్ షా పేరుతో దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటు.. మోదీ అధికారంలోకి వచ్చి 10 ఏళ్లయింది. మేం రిజర్వేషన్లు ఎక్కడ ఎత్తివేశామో చెప్పాలి? ,అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను పక్కా రద్దు చేసి తీరుతాం. వాటిని పేదలకు పంచుతాం. దయచేసి ముఖ్యమంత్రిసహా కాంగ్రెస్ నేతలను కోరుతున్నా.. ఎస్సీ, ఎస్టీల మనోభావాలను దెబ్బతీసేలా, భయానక వాతావరణం సృష్టించేలా రాజకీయాలు చేయొద్దని కోరుతున్నా. 6 గ్యారంటీల అమలుపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేసిన కుట్ర ఇది... ఆర్ఎస్ఎస్ సర్ సంచాలక్ మోహన్ భగవత్ చేసిన ప్రసంగం వీడియోను చూపిస్తే... రిజర్వేషన్లు సమస్య కానేకాదు.. రాజకీయ పార్టీలకే సమస్ వస్తోందని మోహన్ భగవత్ అన్నారు.. అదే జరుగుతోంది

# కేంద్రంలో చక్రం తిప్పేది మనమే

**మొదటి పేజీ తరువాయి**

పంపితే.. రాష్ట్ర ప్రభుత్వం నోరుమూసుకుని కూర్చో వడంలో మతలబేంటని ప్రశ్నించారు. "ఇప్పటికే కృష్ణా నీళ్లను కేఎంబీఆర్కు అప్పగించారు. బీజేపీకి ఓటేస్తే మోసపోతాం. కాంగ్రెస్ వాగ్దానాలను నిలబెట్టుకోలేదు" అని విమర్శించారు. ప్రజల తరపున కొట్లాడే పంచ్ ఎవరు? అని కేసీఆర్ ప్రశ్నిం చగా.. ప్రజలు ముక్తకంఠంతో "మీరే.." అని బదులిచ్చారు. దానికి కేసీఆర్ స్పందిస్తూ.. "మొన్న ఎలక్షన్లలో నన్ను పడగొ 'టారు. ఇప్పుడు మళ్లీ పంచ్' అవ్వమంటారా? అయితే.. మీరు బలు ఇస్తేనే నేను కొట్టాడతా వచ్చే ఎన్నికల్లో సుదీరకుమా ర్ను గెలిపించాలి" అని కోరారు. బీజేపీ ప్రమాదకరమైన పార్టీ అని.. పదేళ్ల కింద నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి, జన్ధన్ ఖాతాల్లో ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షల చొప్పున జమచేస్తానని హామీ ఇచ్చారని.. అది జరగలేదని విమర్శించారు. అమృత్కా ల్.. అచ్చేదిన్ రాలేదని, సచ్చేదిన్ మాత్రం వచ్చిందని ఎద్దేవా చేశారు. కాజీపేటకు కోచ్ఫ్యాక్టరీ వస్తే.. దాన్ని ప్రధాని తన సొంత రాష్ట్రానికి తరలించారని మండిపడ్డారు. రూపాయి విలువ దారుణంగా పడిపోయిందని, 18 లక్షల కేంద్ర ప్రభుత్వో ద్యోగాలు ఖాళీగా ఉంటే.. భర్తీ చేయడం లేదని ఆరోపించారు.

**సీఎం రేవంత్పై ఆగ్రహం**

కేసీఆర్ సీఎం రేవంత్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "అసెం బ్లీలో మన ఎమ్మెల్యేలు హామీలపై నిలదీస్తే.. కేసీఆర్... నీ గుడ్లు పీకి గోలీలు ఆడుకుంటా అన్నాడు. పేగులు తీసి మెడలో వేసుకుంటా అన్నాడు. ఆఖరికి నా చెడ్డీ కూడా గుంజుకుంటా అన్నాడు. నేను పదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటి మాటలు మాట్లాడానా? నా నోట ఇలాంటి మాటలు ఎప్పుడైనా విన్నారా? ఇదేనా సీఎం మాట్లాడే భాష??" అని నిలదీశారు. తనను చర్లపల్లి జైలులో వేస్తానని సీఎం అంటున్నారని గుర్తుచేశారు. "గీ జైళ్లకు.. తోకమట్టకు నేను భయపడతానా? కేసీఆర్ జైళ్లకు భయపడితే తెలంగాణ వచ్చేదా? తెలంగాణ కోసం ఎన్ని దెబ్బలు తిన్నాం? ఎన్ని నిరాహార దీక్షలు చేశాం? ఎన్ని రాజీనామాలు చేశాం? ఎన్ని సారు పదవులను ఎడమకాలి చెప్పులా విసిరేశాం? మేంగిట్లభయపడి ఉంటే.. తెలంగాణ వచ్చేదా?" అని ప్రశ్నించారు. రేవంత్కు తెలంగాణ చరిత్ర, భూగోళం తెలియదని.. ఇటీవల ఎక్కడో మాట్లాడుతూ కృష్ణానదిని కూడా తానే కట్టినట్లు చెప్పారని, ఎక్కడైనా ఎవరైనా నదులను కడతారా? అని ప్రశ్నించారు. రేవంత్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో భయం కరంగా ట్రోలింగ్ జరిగిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం అయిపోలేదని, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం మరో ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ హామీలపై నిలదీత**

"ఓ మహిళ ఏరికోరి మొగుడిని తెచ్చుకుంటే.. ఎగిరెగిరి. తన్నిందంట..! అడ్డగోలుగా హామీలిచ్చిన కాంగ్రెస్ను నమ్మి ఓటేస్తే దేవీ జరుగుతోంది. నాలుగు నెలల్లో తెలంగాణకు గ్రం జబ్బు చేసింది? - కరెంటు ఎక్కడికి పోయింది? సాగునీళ్లు ఏమయ్యాయి? పంటలు ఎందుకు ఎండిపోతున్నాయి? తాగు నీటికి ఎందుకు కరువొచ్చింది? పదేళ్లలో ఇవన్నీ ఉండేవా? కాంగ్రెస్ ఒక్కటంటే ఒక్క హామీని కూడా అమలు చేయ "లేదు" అని విమర్శించారు. రైతుబంధు వస్తుందా? మహిళ లకు రూ.2,500 ఇస్తున్నారా? అని ప్రజలను ప్రశ్నించారు. తాము రూ.30 వేల కోట్లతో రూ. లక్ష వరకు రుణమాఫీ చేశామని, కాంగ్రెస్ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తా మన్న హామీ ఏమైందని నిలదీశారు.

# శ్రీరాముడు బీజేపీ ఎంపీనా.. లేక బీజేపీ ఎమ్మెల్యేనా

**మొదటి పేజీ తరువాయి**

సూటిగా బీజేపీ నేతలను కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రాముడు అందరికీ దేవుడేనని స్పష్టం చేశారు. రాముడిని దేశానికి బీజేపీనే పరిచయం చేసినట్లుగా ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ లేకపోతే బొట్టే పెట్టుకోలేము అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ ఉన్నా దేవుడు ఉంటాడని బీజేపీ లేకపోయిన దేవుడు ఉంటాడని తేల్చిచెప్పారు. ఆదివారం కరీంనగర్‌లో కేటీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌ని గెలిపించాలని అభ్యర్థించారు. కరీంనగర్‌లో బండి సంజయ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. డమ్మీ క్యాండిడేట్‌ను పెట్టి సంజయ్‌ను మరోసారి ఎంపీగా గెలిపించాలని చూస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ఎవరికీ తెలియదని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలమైన అభ్యర్థిని పెడితే బీఆర్ఎస్ గెలుస్తుందని రేవంత్ భయపడ్డారన్నారు. రేవంత్ రెడ్డి సీఎం ఆ లేక బోటీ కొట్టేటోడా. పేగులు మెడలో వేసుకోవడం ఏందీ అని ప్రశ్నించారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా బండి సంజయ్ తెచ్చారా అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

# నవాబులు, నిజాంలపై ఈగ కూడా వాలనీయరు..

**మొదటి పేజీ తరువాయి**

చిన్నమ్మ వంటి గొప్ప యోధులను విమర్శిస్తుంటారని అన్నారు. మనమంతా గర్వించే మైసూరు రాజకుటుంబం సేవలు షెహజాదాకు తెలియవా? అని ప్రధాని ప్రశ్నించారు.
రాహుల్ గాంధీ ఇటీవల కర్ణాటకలో జరిగిన ర్యాలీలో ప్రజల భూములను రాజులు, పాలకులు లాక్కున్నారని, దేశానికి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యాన్ని తీసుకువచ్చి రాజ్యాంగాన్ని అమలు చేసిన కాంగ్రెస్ పార్టీనే వీటిని అడ్డుకుందని చెప్పారు. ఆయన వ్యాఖ్యలపై మోదీ బెళగవి ప్రసంగంలో తూర్పారబడుతూ, కేవలం ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాల కోసం కాంగ్రెస్ షెహజాదా ఈ వ్యాఖ్యలు చేస్తున్నరని అన్నారు. వేలాది హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేసిన ఔరంగజేబ్ కాంగ్రెస్ పార్టీకి గుర్తుకు రాదని ఎద్దేవా చేశారు. మన పర్యాటక స్థలాలను ధ్వంసం చేసి, సంపదను దోచుకుని, ప్రజలను, గోవులను చంపిన వారిపై గొంతు పెగలదని అన్నారు. బనారస్ హిందూ యూనివర్శిటీకి ఏర్పాటు చేసేందుకు బెనారస్ రాజు సాయం చేశారని, బీఆర్ అంబేద్కర్‌లోని ప్రతిభను బరోడా మహారాజు గుర్తించారని ప్రదాని వివరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే శాంతి భద్రతలు క్షీణించడం మొదలైందని విమర్శించారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌లపై అబద్ధాలు చెప్పిన కాంగ్రెస్ పార్టీకి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఎండలతో బీకేర్ ఫుల్




**మొదటి పేజీ తరువాయి**

అవుతున్నారు. ఏప్రిల్ నెల నుంచి కొన్ని జిల్లాల్లో 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తీవ్రమైన ఎండలకు తోడు వడగాల్పులు వీస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది.

**8 జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు..**

దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు తెలంగాణలో నమోదవుతున్నాయి. శుక్రవారం దాదాపు 8 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటింది. గత పదేళ్లలో ఏప్రిల్ నెల చివరి వారంలో ఒకేసారి ఇన్ని కేంద్రాల్లో ఈస్థాయి ఎండలు చూడటం ఇదే తొలిసారి. 45 డిగ్రీలు దాటిన కరీంనగర్, ములుగు, నల్గొండ, జగిత్యాల, యాదాద్రి, వరంగల్, వనపర్తి జిల్లాలకు రెడ్ వార్నింగ్ జారీ చేసింది వాతావరణశాఖ.
జమ్మికుంట-45.6, మంథని-45.2, నిడదమానురు-45.2, కోల్వాయి-45.1, మాడుగలపల్లి-45.1, మర్యాల-45.1, వీణవంక-45.1, వెల్గటూరు-45.1, భద్రాచలం-44, హైదరాబాద్-42 గా నమోదైంది..
తెలంగాణలో మరో మూడు రోజులపాటు ఎండలు మండిపోనున్నాయి. వృద్దులు, పిల్లలు, వీధి వ్యాపారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. వీలయినంతవరకూ ఓర్ఎస్, చలువ చేసే ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

**ఏపీలోనూ భానుడి భగభగలు..**

ఏపీలోనూ భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతోంది. ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వడగాలులు కొనసాగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు వడగాల్పులతో జనం అల్లాడిపోతున్నారు. ఇవాళ 58 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 148 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

**శ్రీకాకుళంలో 17 మండలాల్లో తీవ్ర వడగాల్పులు**

ఇక నిన్న ఏపీలోని నంద్యాలజిల్లా చాగలమర్రిలో 45.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. తిరుపతిజిల్లా రేణిగుంటలో 45.7, కడపజిల్లా ఖాజీపేట, పార్వతీపురంమన్యం జిల్లా సాలూరులో 45.7, విజయనగరంజిల్లా గజపతినగరం, కర్నూలుజిల్లా కోడుమూరులో 44.8, అనంతపురంజిల్లా తాడిపత్రిలో 44.4, పల్నాడుజిల్లా మాచెర్లలో 44.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది.
ప్రజలు వీలైనంతవరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని విపత్తుల సంస్థ అధికారులు సూచించారు. వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



## కంఠమహేశ్వర స్వామి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం



భువనగిరి, ఏప్రిల్ 28(రోమింగ్ న్యూస్)మండలంలోని వీరవెల్లి గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌడ కులస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, కార్యకర్తలు, గౌడ కులస్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఎండలో చల్లని మజ్జిగ పంపిణీ..

### పనసుపునూరి లక్ష్మి నారాయణ జ్ఞాపకార్థంగా ప్రతి రోజు మజ్జిగ పంపిణీ



భువనగిరి, ఏప్రిల్ 28(రోమింగ్ న్యూస్)వాసవిక్లబ్ యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో పనసుపునూరి లక్ష్మి నారాయణ జ్ఞాపకార్థంగా వారి తండ్రి రిటైర్మెంట్ టీచర్ బసవరాజు ఆదివారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవే మా మార్గం చేయూతే మా లక్ష్యంతో ఈ రోజు భువనగిరి మున్సిపల్ పట్టణంలో ఎండలు మండుతున్న కారణంగా ఈ సేవ కార్యక్రమం చెయ్యడానికి మేం ముందుకు కదిలినాము. ఇది మేం చేసిన ఉచిత కార్యక్రమం. ఈసందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సంపాదించేవారు చాలామంది ఉన్నారు కానీ మంచి పని చెయ్యడానికి మానవత్వం కలిగినవారు బహు తక్కువమంది ఉన్నారు. మంచి పని చేయడం ఒక బాధ్యతలా భావించి ఈ కార్యక్రమం చెయ్యడానికి ముందుకు వచ్చిన బసవరాజుకీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తీవ్ర ఎండలో ఇబ్బందిపడకుండా ఉండాలని గమనించి ఉచితంగా మజ్జిగ ఇవ్వాలని నిర్ణయించుకున వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రెసిడెంట్ జిడిగం లక్ష్మయ్య, సోమశేఖర్, పోకల సోమన్న, పద్మాల ప్రభాకర్, మిత్తింటి భాస్కర్, ఎడవల్లి నవీన్ కుమార్, బాలేష్, జిల్లా విద్యాసాగర్, సోమ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల వేళ రాష్ట్రంలో రిజర్వేషన్ల పంచాయతీ

### కాంగ్రెస్, బీజేపీ పార్టీల నడుమ రాజకుంటున్న నిప్పు

లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణ గడ్డ మీద రిజర్వేషన్ల పంచాయతీ ఓ రేంజ్‌లో కొనసాగుతోంది. ఈ విషయంలో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నడుమ నిప్పు రాజేస్తోంది. పొరపాటున బీజేపీని గెలిపిస్తే.. రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలోనే రేవంత్‌కు ఎంపీ బండి సంజయ్ ఓ రేంజ్‌లో కౌంటర్ ఇచ్చారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ రిజర్వేషన్లపై మాట్లాడుతోందని ధ్వజమెత్తారు. ఎలాంటి రిజర్వేషన్ల రద్దు ఉండబోదని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మరోసారి నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మతాలను గౌరవించే పార్టీ కేవలం బీజేపీయేనని అన్నారు. హస్తం పార్టీ ఓ ప్లాన్ ప్రకారంగా ముందుకు వెళ్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా రెండు దశల్లో పోలింగ్ ప్రక్రియ పూర్తైందని, ఎక్కడ చూసినా బీజేపీ అనుకూల వాతావరణం ఉండటం కాంగ్రెస్‌కు సీట్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రేవంత్ రిజర్వేషన్ల రాగం అందుకున్నాడని ఫైర్ అయ్యారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న నాటకాలేనని బండి సంజయ్ కొట్టిపడేశారు.

# లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం చారిత్రాత్మక అవసరం

### కాంగ్రెస్ తోనే సమాచార హక్కు చట్టం సాధ్యం

### ఉమ్మడి రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు



నకిరేకల్ ఏప్రిల్ 28 (రోమింగ్ న్యూస్) దేశంలో నిర్వహించనున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం చారిత్రాత్మక అవసరమని, సమాచార హక్కు చట్టం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు అన్నారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్ లో ఆదివారం సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన సదస్సును సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్ర మాద కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో సోనియాగాంధీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం గృహింస చట్టం చట్టం పేదలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో సాగుతున్న పాలన ప్రజల మెప్పు పొందుతుందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలను స్వల్ప వ్యవధిలోనే అమలు చేసిన తీరు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపునకు ఆర్టిఐ కార్యకర్తలు తమ వంతు సహకారం అందించాలన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ విజన్ ను ముందుకు తీసుకుపోయే విధంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండేందుకు ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకు సమాచార హక్కు చట్టం వచ్చిందన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి పాలనలో పారదర్శకత అధికారుల్లో జవాబుదారితనం పెరిగిందని అదే సమయంలో ప్రజలు చైతన్యవంతం అయ్యారు అని అన్నారు. కొందరు కేంద్రంలో ఇండియా కూటమిని ఓడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మేధావి వర్గం ఆ ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన సదస్సులో ఎస్ హెచ్ వి ఎస్ రాష్ట్ర గౌరవ సలహాదారులు కోటగిరి దైవాధీనం, నల్లగొండ జిల్లా అధ్యక్షులు బైరు సైదులు గౌడ్, ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు ఎర్ర మాద హేమలత, రాష్ట్ర కమిటీ సభ్యులు గంధమల్ల జయంత్, బోగరి రామకృష్ణ, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి చైతన్యమే సమ సమాజ నిర్మాణం: సునీత రామ్మోహన్ రెడ్డి



భువనగిరి, ఏప్రిల్ 28(రోమింగ్ న్యూస్)మహిళా శక్తి చైతన్యమే సమ సమాజ నిర్మాణమని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైయస్సార్ గార్డెన్లో విశ్వహిందూ పరిషత్ జిల్లా మాతృశక్తి దుర్గావాహిని ఒకరోజు అభ్యాస వర్గ కార్యక్రమ బొక్క అరుణ్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ఆమె మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మాతృశక్తి దర్గా వాహిని పనిని కార్యకర్తలు ఇంకా విస్తృతంగా ముందుకు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. సమాజంలో అధిక సమస్యలకు పరిష్కారం చూపే సత్తా మహిళ శక్తికే ఉందని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సనాతన ధర్మంలో నారీ శక్తికి ఎంతో ప్రాముఖ్యత ఉందని దానిని గుర్తించి తగువిధంగా ఉపయోగించుకుంటే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి మహిళ యువతులు సత్సంగాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యున్నత శక్తి మహిళా శక్తి అని మహిళలు యువతులు శక్తి రూపం దాల్చి సనాతన ధర్మాన్ని ముందుండి నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాతృ శక్తి తెలంగాణ ప్రాంత సంయోజిక పద్మశ్రీ, ప్రాంత సహ సంయోజిక శ్రీవాణి, నల్గొండ విభాగ్ సంయోజిక సత్యవతి, భాగ్యలక్ష్మి, విభాగ్ సంయోజిక జ్యోతి, సహ సంయోజిక అరుంధతి, మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్వి లావణ్య, దంత సుమిత్ర, సత్యలక్ష్మి, జిల్లా అధ్యక్షులు పొత్నక్ రాఘవేందర్, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సహ కార్యదర్శి తోట భాను ప్రసాద్, జిల్లా కార్యదర్శి సుక్కల శ్రీశైలం యాదవ్, చామ రవీందర్, పట్టణ కార్యదర్శి సాల్వేరు వేణు, భింగి భరత్, బజరంగ్దళ్ పట్టణ కన్వీనర్ నమిలె నవీన్, శివ, పూస శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మోడీ రైతులకు పెద్దపీట వేశారు...

### రైతులందరు ఏకమై బిజెపిని గెలిపించాలి : బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి

భువనగిరి, ఏప్రిల్ 28(రోమింగ్ న్యూస్) : ప్రధాని నరేంద్ర మోడీ రైతులకు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్.ఎం.ఆర్ గార్డెన్ లో జరిగిన పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల రైతు సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులు తలుచుకుంటే ప్రభుత్వాలు గెలుస్తాయి, ఓటమిపాలవుతాయని అన్నారు. మోసం చేసిన బిఆర్ఎస్ పార్టీని రైతులు ఓడించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అంటే మోసం దగా అని అన్నారు. రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. రైతులందరూ ఏకమై భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ను గెలిపించాలన్నారు. అనంతరం ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి భువనగిరి పార్లమెంట్ కోఆర్డినేటర్ పడమటి జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి, పాపారావు, బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర అధికార ప్రతినిధి సురకంటి రంగారెడ్డి, పార్లమెంట్ నాయకులు బండారపు లింగస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకన్న, కొత్త రాంరెడ్డి, అచ్చయ్య, అన్నం శివకుమార్, లక్ష్మారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాస్ కాలభైరవ నాయకులు పాల్గొన్నారు.


welcome to

wonder kids
BUILDING BLOCKS FOR BRILLIANT MINDS

WONDER KIDS PLAY SCHOOL
BUILDING BLOCKS FOR BRILLIANT MINDS



Inspire a generation of lifelong learners who embrace curiosity, creativity, and compassion.



PLAY GROUP
NURSERY
LKG
UKG

YADAGIRIGUTTA
FOR ADMISSIONS CALL : 9666497893

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 ఏప్రిల్
2024





# అవకాశవాద బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌ను ఓడించండి

## ప్రజల పక్షాన పోరాడే యండి. జహంగీర్‌ని గెలిపించండి

భువనగిరి ఏప్రిల్ 28 (రోమింగ్ న్యూస్) పూట కొక్క పార్టీలు మార్చి అవకాశవాద రాజకీయాలు చేస్తూ ధనార్జనే ధ్యేయంగా ముందుకు వస్తున్న బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ ను ఓడించి ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి పోరాటాలలో ముందుండి పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థి యండి. జహంగీర్ ను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలోని సిపిఎం కార్యాలయంలో గ్రామ జనరల్ బాడీ సమావేశం ఏదునూరి మల్లేష్ అధ్యక్షతన సమావేశం జరుగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాల మోడీ బిజెపి పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు గురైందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మొదలుకొని అన్ని రంగాలను బిజెపి సమూలంగా మార్చి తన మతోన్మాద మనువాద ఎజెండాను అమలు చేయడానికి చాలా పెద్ద ఎత్తున కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ చట్టాలను మార్చి పనిభారాలను పెంచిందని, వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు తన అన్యాయులైన అంబానీ అదానీలకు కట్టబెట్టడానికి నల్ల చట్టాలు తెస్తే దేశవ్యాప్తంగా రైతాంగము వారి మద్దతుగా అన్ని వర్గాల ప్రజలు తిరుగుబాటుతో వెనుక కొట్టిన పరిస్థితి ఉన్నదని అన్నారు. ఇప్పటికే కీలక రంగాలైన రైల్వే ఎల్ఐసి పోస్టల్ టెలికం సంస్థలలో ప్రైవేటు పెట్టుబడులకు ఆహ్వానించి మె-ుత్తం ప్రైవేట్ పరం చేయాలని బిజెపి ఆలోచన చేస్తుందని విమర్శించారు. మరోపక్క విపరీతమైన ధరలు పెంచి సామాన్య మానవులు నిత్యవసర వస్తువులను కొనితిని పరిస్థితుల్లో లేకుండా



పోయిందని అన్నారు. విద్య వైద్యం ఉపాధి సంక్షేమం లాంటి విషయాలలో బిజెపి 10 సంవత్సరాల పాలనలో ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. బిజెపి మరో మారు గెలిస్తే ఈ దేశంలో కార్మికులు కర్షకులు వ్యవసాయ కూలీలు బతికే పరిస్థితి ఉండదని, రాజ్యాంగం, పౌర హక్కులు, ప్రజాస్వామ్యం హరించబడతాయని అన్నారు ఇప్పటికైనా ప్రజలందరూ ఆలోచన చేసి బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించి సిపిఎం ను ఈ పార్లమెంటులో గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి చేయూతనియాలని భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కమిటీ సభ్యులు గునుగుంట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచి బొల్లెపల్లి కుమార్ పాల్గొని మాట్లాడగా. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లావుడియా రాజు, గ్రామ శాఖ కార్యదర్శి అబ్దుల్లాపురం వెంకటేష్, ఏరియా కార్యదర్శులు ఎద్దులూరి వెంకటేష్, ముచ్చపతి బాలయ్య , నాయకులు యండి.జహంగీర్, కడారి కృష్ణ, షాపోద్దీన్, బొల్లెపల్లి పరమేష్, పిట్టల బాలరాజు, నరసింహ, వెంకటస్వామి, మహేందర్, స్వామి, సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారం





శ్రీశైలం, ఏప్రిల్ 28 ( రోమింగ్ న్యూస్ ) : శ్రీశైలం మండలం అభివృద్ధి చెందాలి అంటే బుడ్డా రాజన్నే గెలవాలని నినదించిన ప్రజలు తొలి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీశైలం మండలం శ్రీశైలంలో భారీ బహిరంగ సభ లింగాల గట్టు, సున్ని పెంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో రౌతు అశోక్ కుమార్.

జనసేన పార్టీ శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అబద్ధపు హామీలు, అన్యాయాలు, అక్రమాలు ,అవినీతులు మాత్రమే జరిగాయి.ప్రజలకు ఏ విధమైన న్యాయం జరగలేదు.యువతకి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఏది కూడా చెయ్యలేదు.సొంత ఆడపడుచులకు న్యాయం చేయలేని సీఎం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలి. ప్రభుత్వం రాగానే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరుగుతుంది.అందరికి మంచి జరుగుతుందని ప్రజలందరికీ వివరించడం జరిగింది. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు సైకిల్ గుర్తుకే వేసి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్న గారిని మరియు ఉమ్మడి నంద్యాల జిల్లా ఎంపీ అభ్యర్థి శ్రీమతి డాక్టర్ బైరెడ్డి శబరి మేడం గారిని మీ అమూల్యమైన ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రతి ఒక్కరిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జెడ్డా దేవరాజు, కోనేటి మల్లికార్జున ,వంశీ ,విక్రమ్ దాస్ , నాగ సాయి, కొట్టే సురేందర్ ,పిరావలి, నాగులు ,వీరయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, రమణ, ఐ వెంకటేశ్వర్లు, నాయుడమ్మ, మల్లమ్మ, శారదాంబ, మరియమ్మ, ఖాతారామిరెడ్డి, బెంజిమెన్, ఉమా, మల్లేష్, సుబ్బారెడ్డి ,బిజెపి నాయకులు వెంకటేశ్వర్లు, చదువుల శీను, చిక్కుడు చెట్టు వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు ,మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు జైలుకెళ్లడం ఖాయం

### ఎమ్మెల్యే, పార్లమెంట్ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి, అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో త్వరలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు జైలుకెళ్లడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన ఆరుగురు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నారాయణపురం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య, పుట్టపాక సర్పంచ్ భాస్కర్ వారి అనుచరులు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కు ప్రజలు మూకుమ్మడిగా ఓటేసి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని ఎదురుచూసిన ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాశే కల్పించిందని ఆయన అన్నారు. కేసీఆర్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల ఊబిలో చిక్కుకుందని మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికల నుంచి మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఫోన్లు ట్యాపింగ్ లు చేసి పోలీస్ వాహనాల్లో డబ్బులు తరలించి బీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని అన్నారు. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా గెలిచే పరిస్థితి లేదని, కాంగ్రెస్ కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కనీసం 14 సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల్లో ఎంత పెద్ద మనుషులు ఉన్నా శిక్ష తప్పదని హెచ్చరించారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎన్ఎస్యుఐ, యూత్ కాంగ్రెస్ లో నుండి పార్టీలో కీలకంగా పనిచేశాడని అతనని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## 138వ మే డే జయప్రదం చేయండి..

### ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్..




భువనగిరి ఏప్రిల్ 28 (రోమింగ్ న్యూస్) ప్రపంచ కార్మిక దినోత్సవమైన మే డే ను యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించి ఎర్ర జెండాలు ఎగురవేసి కార్మికుల ఐక్యతను చాటాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పిలుపునిచ్చారు.ఆదివారం రోజున సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం గోరేటి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపేడుతున్నదని ఆరోపించారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అయిందని ఈ10 సంవత్సరాల కాలంలో కార్మికులకు కర్షకులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం హామీని అమలు చేయలేదని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా నెలకు పదివేల రూపాయల పెన్షన్ అందించాలని, గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని 2021లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 5 కనీస వేతనాల జీవోలకు గెజిట్ ఇచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తూ పట్టణాలకు విస్తరించాలని, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ మరియు స్కీం వర్కర్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, హమాలీ కార్మికుల కోసం సమగ్ర సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, అసంఘటిత కార్మిక వర్గానికి సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రైవేటీకరణ వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, నాయకులు గనబోయిన వెంకటేష్, గోపగాని రాజు, సోమన సబిత, సామల శోభన్ బాబు, దాసరి లక్ష్మయ్య, పుట్ట రమేష్, పల్లె శ్రీనివాస్ ముదిగొండ బసవయ్య, పాపగల్ల శంకరయ్య, చింతల మల్లేష్, నర్సింహా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కేసముద్రం,ఏప్రిల్ 28 (రోమింగ్ న్యూస్): కేసముద్రం మండలంలోని గీతాంజలి హైస్కూల్లో 1999 - 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం గీతాంజలి హై స్కూల్లో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి యాకూబ్ రెడ్డి,జడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి,గురుజాల శేఖర్, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, పాము స్వామి,పుడకంటి సతీష్,బూర స్వప్న,జోష్ణ, తోకల శ్రీలత,సింగారపు కవిత, తమ్ముడు బోయిన రాజు, నాన్నబాల రమేష్,డోలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నల్గొండలో 11 కోట్ల విలువ గల నగదు, మద్యం, గంజాయి సీజ్

### ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిత్యం వాహన తనిఖీ

### మీడియాకు జిల్లా ఎస్పీ చందనా దీప్తి వెల్లడి

నల్గొండ, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల వేళ నల్గొండలో ఇప్పటివరకు భారీగా నగదు, మద్యం పట్టుపడినట్లు జిల్లా ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిత్యం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీ నిర్వహించామని ఆమె చెప్పారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో నగదు, మద్యం సీజ్ చేశామన్నారు. ఏప్రిల్ 28 ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 11 కోట్ల 7 లక్షల 41 వేల రూపాయల విలువ గల నగదు, మద్యం, గంజాయి, ఇతర వస్తువుల స్వాదీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా, సరిహద్దు ప్రాంతాలు వాడపల్లి, అడవిదేవులపల్లి టెయిల్ పాండ్, నాగార్జున సాగర్ అంతరాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అధికారులతోనూ సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ లకు అనుబంధంగా జాతీయ రహదారి 65 పై కేతపల్లి టోల్ ప్లాజా, చిట్యాల పోలీసు స్టేషన్ వట్టిమర్తి, మాల్, డిండి పోలీసు స్టేషన్ పరిదిలో ఇలా పలు ప్రాంతాల్లో అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామని చెప్పారామె. పారామిలిటరీ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన అధికారుల సహాయంతో జిల్లా అంతటా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## మెట్రో ఫేజ్-2కి పై వచ్చిన క్లారిటీ

### నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న మెట్రో మార్గం

### 13 మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రాబోతున్నట్లు మెట్రో ఎండీ ప్రకటన


హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ ప్రజలకు మెట్రో గుడ్ న్యూస్ చెప్పింది. మెట్రో ఫేజ్-2కి సంబంధించి క్లారిటీ వచ్చేసింది. ఇందులో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో కొత్తగా మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 14 కి.మీ మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇందులో భాగంగానే కొత్తగా 13 మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రాబోతున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న నాగోల్ స్టేషన్ సమీపంలో మొదటి స్టేషన్‌తో ప్రారంభమై ఆ తర్వాత నాగోల్ చౌరస్తా, అల్కాపురి చౌరస్తా, కామినేని ఆసుపత్రి, ఎల్బీనగర్ కూడలి, సాగర్ రింగ్‌రోడ్డు, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట రోడ్ కూడలి, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీవో, హఫీజ్ బాబానగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో కొత్త మెట్రో స్టేషన్లు రాబోతున్నాయని పేర్కొన్నారు. ఈ రూట్‌లో మెట్రోరైలు ఎలైన్‌మెంట్, స్టేషన్ల స్థానాలను ఖరారు చేసేందుకు ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాగోల్ నుంచి చంద్రాయణగుట్ట వరకు కొన్ని ఫ్లైఓవర్ల వల్ల స్టేషన్ల కోసం భూసేకరణ అనివార్యంగా మారిందని అధికారులు నివేదించారు. ప్రైవేటు ఆస్తులు కనిష్ఠంగా సేకరించేందుకు ప్రణాళికలు చేపట్టలాని అధికారులకు ఆదేశించారు. అలాగే మెట్రో రైలు స్టేషన్లకు సంబంధించి వాటి పేర్ల ఖరారుకు ట్రాఫిక్ పోలీసులు, సాధారణ ప్రజల నుంచి సలహాలు స్వీకరించాలని సూచనలు చేశారు. ఫేజు -2 లోభాగంగా చేపడుతున్న మార్గంలో భాగంగా ఈ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. దీని ద్వారా నగరంలోని ప్రయాణీకులకు వెసులుబాటు కలగనుంది.

## మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్‌ను అలా వదిలేస్తే ఎలా

### ప్రాణహితకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం..

### తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం

### జ్యుడీషియల్ విచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్



హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజ్ బ్లాక్‌ను అలా వదిలేస్తే ఎలా.. అని జ్యుడీషియల్ విచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ అభిప్రాయపడినట్టు విశ్వసనీయంగా తెలిసింది. జూన్ నెలలోనే ప్రాణహితకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బరాజ్‌లో తదుపరి నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. ఈ మేరకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)కి లేఖ రాసి, తక్షణం చేపట్టాల్సిన మరమ్మతులు, చర్యలపై మధ్యంతర నివేదిక తెప్పించుకోవాలని సూచించారు. అదేవిధంగా అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై కూడా నివేదిక తెప్పించుకోవాలని సూచించినట్టు తెలిసింది. మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్‌లో మూడు పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. దీనిపై ఎన్డీఎస్ఏ కమిటీ పలు దఫాలుగా క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఈ కమిటీ నివేదిక సమర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల గడువు ఇచ్చింది. అయితే, జూన్‌లోనే వరదలు వచ్చే అవకాశం ఉండటంతో బరాజ్‌కు మరింత నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నిపుణులు గతంలోనే సూచించారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లు సైతం తక్షణ చర్యలపై ఎన్డీఎస్ఏకు నివేదిక కూడా ఇచ్చారు. కానీ, ఎన్డీఎస్ఏ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక అందలేదు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కూడా 'ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చే వరకు వేచిచూద్దాం' అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. దీంతో మధ్యంతర నివేదిక కోసం ఎన్డీఎస్ఏపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. రెండు, మూడురోజుల్లో ఎన్డీఎస్ఏ నివేదిక రాబోతున్నదని ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించినా అలాంటిదేమీ రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికను వెంటనే తెప్పించుకోవాలని ప్రభుత్వానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్ సూచించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. బరాజ్‌కు మరింత నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆది నుంచీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అదే తరహాలో తాజాగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కూడా నీటి పారుదల శాఖను ఆదేశించడం విశేషం. కాళేశ్వరంపై జ్యుడీషియల్ విచారణ చేపట్టిన ఘోష్.. శనివారం కోల్‌కతాకు వెళ్లేముందు అధికారులతో సమావేశమయ్యారు. మే నెలాఖరున లేదా జూన్‌లో గోదావరికి వరదలు రానున్న నేపథ్యంలో బరాజ్‌లు మరింత దెబ్బతినకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. దీనికోసం అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ నివేదికను తెప్పించుకోవడానికి వీలుగా కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌కు లేఖ రాయాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు. ఆ నివేదికను వెనువెంటనే తెప్పించుకొని, దాని ఆధారంగా బరాజ్‌ల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విచారణలో ఎన్సీఎస్ఏ నివేదిక కూడా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. తదనంతరం హైదరాబాద్‌కు చేరుకొని.. కాగ్ నివేదికతోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదిక, ఎన్డీఎస్ఏ నివేదికలపై అధ్యయనం చేసే అవకాశాలున్నాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
29 ఏప్రిల్
2024





# విల్ జాక్స్ విధ్వంసం

**సిక్సర్లతో గుజరాత్‌ను ముంచిన ఆర్సీబీ బ్యాటర్**

**201 టార్గెట్‌ను 16 ఓవర్లలోనే ఊదేసిన బెంగళూరు**

**రాణించిన కోహ్లీ**





**ఐపీఎల్-17లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మరోసారి అదరగొట్టింది. నాలుగు రోజుల క్రితమే హైదరాబాద్‌ను చిత్తుచేసిన బెంగళూరు.. తాజాగా అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌కు చుక్కులు చూపించింది. గుజరాత్ నిర్దేశించిన 201 పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఊదేసింది. ఛేదనలో రారాజు కోహ్లీ మరోసారి మెరవగా విల్ జాక్స్ సిక్సర్ల సునామీతో 41 బంతుల్లోనే సెంచరీ చేశాడు. అంతకుముందు గుజరాత్ తరఫున సాయి, షారుక్ ఖాన్‌లు రాణించినా ఆ జట్టు బౌలర్లు విఫలమయ్యారు.**

అహ్మదాబాద్: ఐపీఎల్-17 సీజన్ తొలి అంకంలో ఆరు మ్యాచ్‌లు ఓడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో మ్యాచ్ గెలుచుకుంది. అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌ను వాళ్ల సొంతగడ్డలో 9 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. గుజరాత్ నిర్దేశించిన 201 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్సీబీ.. మరో 24 బంతులు మిగిలుండగానే ఊదేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' విల్ జాక్స్ (41 బంతుల్లో 100 నాటౌట్, 5 ఫోర్లు, 10 సిక్సర్లు) నరేంద్ర మోడీ స్టేడియంలో సిక్సర్లతో హోరెత్తించి అజేయ శతకం సాధించగా విరాట్ కోహ్లీ (44 బంతుల్లో 70 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 84 నాటౌట్, 8 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించగా షారుక్ ఖాన్ (30 బంతుల్లో 58, 3 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు.

### సాయి, షారుక్ ఖాన్‌ల జోరు

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ 45 పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. గిల్ (16) మరోసారి విఫలమయ్యాడు. కానీ వన్‌డౌన్ బ్యాటర్ సాయి, బ్యాటింగ్‌లో ప్రమోషన్ పొందిన షారుక్ ఆర్సీబీ బౌలర్లను దంచికొట్టారు. ఈ ఇద్దరూ ధాటిగా ఆడటంతో గుజరాత్ భారీ స్కోరు దిశగా సాగింది. షారుక్ ఔట్ అయినా మిల్లర్ (19 బంతుల్లో 26 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) తో కలిసి సాయి గుజరాత్ స్కోరును 200 మార్కుకు చేర్చాడు.

### ఆరంభంలో కోహ్లీ.. ఆఖర్లో జాక్స్..

భారీ ఛేదనను ఆర్సీబీ ధాటిగానే ఆరంభించింది. ఫాఫ్ డుప్లెసిస్ (12 బంతుల్లో 24, 1 ఫోర్, 3 సిక్సర్లు) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించి కోహ్లీతో కలిసి తొలి వికెట్‌కు 3.5 ఓవర్లలోనే 40 పరుగులు జోడించాడు. ఫాఫ్ ఔట్ అయ్యాక గుజరాత్ బౌలర్లపై కోహ్లీ ఎదురుదాడికి దిగాడు. 32 బంతుల్లోనే కోహ్లీ అర్ధ సెంచరీ పూర్తయింది. ఇక క్రీజులో కుదురుకునేదాకా నెమ్మదిగా ఆడిన జాక్స్ ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 14 ఓవర్లు ముగిసేసరికి ఆర్సీబీ స్కోరు 148/1 కాగా మిగిలిన 2 ఓవర్లలో జాక్స్ విధ్వంసరచనకు తెరతీశాడు. మోహిత్ శర్మ 15వ ఓవర్లో 4, 6, 6, 6, 4తో 29 పరుగులు రాబట్టిన అతడు.. రషీద్ ఖాన్ 16వ ఓవర్లో 6, 6, 4, 6, 6 తో 41 బంతుల్లో శతకాన్ని పూర్తిచేయడమే గాక మ్యాచ్‌నూ ముగించాడు. తొలి 29 బంతుల్లో 44 పరుగులే చేసిన జాక్స్.. ఆ తర్వాత 11 బంతుల్లోనే 56 రన్స్ దండుకున్నాడు. ఇందులో 7 సిక్సర్లున్నాయి. రెండో వికెట్‌కు ఈ జోడీ 12.1 ఓవర్లలోనే 156 పరుగులు జోడించింది.

5 జాక్స్ సెంచరీ ఐపీఎల్‌లో ఐదో వేగవంతమైన శతకం. గేల్ (30), పఠాన్ (37), మిల్లర్ (38), ట్రావిస్ హెడ్ (39)లు జాక్స్ కంటే ముందున్నారు.

### సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 200/3 (సాయి 84 నాటౌట్, షారుక్ 58, స్వప్నీల్ 1/23, మ్యాక్స్‌వెల్ 1/28).
బెంగళూరు: 16 ఓవర్లలో 206/1 (జాక్స్ 100 నాటౌట్, కోహ్లీ 70 నాటౌట్, కిషోర్ 1/30)

# హైదరాబాద్‌ను చిత్తుచేసిన చెన్నై

## గైక్వాడ్ కెప్టెన్ ఇన్నింగ్స్

**ఈ సీజన్‌లో ముందు బ్యాటింగ్ చేస్తూ భారీ స్కోర్లు నమోదుచేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఛేదనలో మాత్రం వరుసగా రెండోసారి చేతులెత్తేసింది. ఉప్పల్‌లో బెంగళూరుతో ఆడిన గత మ్యాచ్ మాదిరిగానే చెపాక్ (చెన్నై) లోనూ తడబడింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సమిష్టి ప్రదర్శనతో ఎస్ఆర్‌హెచ్‌పై ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. చెన్నై నిర్దేశించిన 213 పరుగుల లక్ష్య ఛేదనలో 134 పరుగులకే ఆలౌట్ అయింది.**



చెన్నై: ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మళ్లీ చేతులెత్తేసింది. ఆదివారం చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ముగిసిన పోరులో భాగంగా 213 పరుగులను ఛేదించే క్రమంలో ఎస్ఆర్‌హెచ్.. 134 పరుగులకే కుప్పకూలి 78 పరుగుల తేడాతో ఓడింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 212 పరుగుల భారీ స్కోరు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (54 బంతుల్లో 98, 10 ఫోర్లు, 3 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. డారిల్ మిచెల్ (32 బంతుల్లో 52, 7 ఫోర్లు, 1 ఇన్నింగ్స్) రాణించాడు. అనంతరం ఛేదనకు దిగిన హైదరాబాద్.. 18.5 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌట్ అయింది. మార్క్రమ్ (26 బంతుల్లో 32, 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా టాపార్డర్ బ్యాటర్లంతా చేతులెత్తేశారు. సీఎస్‌కే బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే (4/27), మతీశ పతిరాన (2/17) హైదరాబాద్‌ను కట్టడి చేశారు. గైక్వాడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్

చెన్నై బ్యాటింగ్‌లో గైక్వాడ్ ఇన్నింగ్సే హైలైట్. రహానే నిరాశపరిచినా వన్‌డౌన్‌లో వచ్చిన డారిల్ మిచెల్‌తో కలిసి సీఎస్కే స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. రెండో వికెట్‌కు 107 పరుగులు జతచేసిన ఈ జోడీని 14వ ఓవర్లో ఉనద్కత్ విడదీశాడు. చివరి ఓవర్లలో దూబే (20 బంతుల్లో 39 నాటౌట్, 1 ఫోర్, 4 సిక్సర్లు)తో కలిసి చెన్నై సారథి దూకుడుగా ఆడటంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

### రైజర్స్..మళ్లీ అదే తడబాటు..

భారీ ఛేదనలో రైజర్స్ మరోసారి తేలిపోయింది. ట్రావిస్ హెడ్ (13), అభిషేక్ శర్మ (15)ను పెవిలియన్‌కు పంపిన తుషార్ ఎస్ఆర్‌హెచ్‌ను ఆదిలోనే దెబ్బతీశాడు. నితీశ్ (15) నిరాశపరిచాడు. మార్క్రమ్‌ను పతిరాన పదో ఓవర్లో ఐదో బంతికి క్లీన్‌బౌల్డ్ చేసి రైజర్స్‌ను కోలుకోనీయలేదు. హైదరాబాద్ భారీ ఆశలు పెట్టుకున్న హెన్రిచ్ క్లాసెన్ (20) కూడా పతిరాన బౌలింగ్‌లోనే పెవిలియన్ చేరాడు. అబ్దుల్ సమద్ (19)ను శార్దూల్ ఔట్ చేయడంతో చెన్నై విజయం ఖరారైంది.

### సంక్షిప్త స్కోర్లు


చెన్నై: 20 ఓవర్లలో 212/3 (రుతురాజ్ 98, మిచెల్ 52, భువనేశ్వర్ 1/38, ఉనద్కత్ 1/38).
హైదరాబాద్: 18.5 ఓవర్లలో 134 (మార్క్రమ్ 32, క్లాసెన్ 20, తుషార్ 4/27, పతిరాన 2/17)



# రవిక అందంలో రుహానీ

టాలీవుడ్ లో రుహానీ శర్మ జర్నీ సక్సెస్ ఫుల్ గా సాగిపోతుంది. తొలి సినిమా %-%చిలసౌ%-%తోనే ట్యాలెంటెడ్ బ్యూటీ అనిపించింది. త్రివిక్రమ్ లాంటి దిగ్గజంతో సైతం రిలీజ్ కి ముందే ప్రోమోలతోనే ప్రశంసలందుకుంది. అటుపై పాత్రల ఎంపికలోనూ ఎంతో సెలక్టివ్ గా కనిపించింది. రొటీన్ కి భిన్నమైన పాత్రలు రావడం...నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు కావడంతో మరింత రీచ్ అయింది. %-%సైంధవ్%-...-%ఆపరేషన్ వాలెంటైన్%-% లాంటి సినిమాలు ప్లాప్ అయినా! రుహానీ వరకూ పాస్ అయిపోయింది.

ఇటీవలే %-%శ్రీరంగ నీతులు%-% అంటూ ప్రేక్షకులముందుకొచ్చింది. అందులో నటనకు ఆస్కారం ఉన్న రోల్ కావడంతో సినిమా ఫలితం ఎలా ఉన్నప్పటికీ నెగిటివ్ ఇంప్రెషన్ అయితే పడలేదు. కెరీర్ పరంగా రుహానీకి ఇంకా మంచి భవిష్యత్ కనిపిస్తుంది. మరి అమ్మడి బ్యూటీ సంగతేంటి? అంటే అందులోనూ రుహానీ తక్కువేం కాదు. ఎప్పటి కప్పుడు వేడెక్కించే ఫోటోలతో కుర్రకారుని అలరిస్తూనే ఉంటుంది. హాట్ భంగిమలతో యువత అటెన్షన్ డ్రా చేస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తైతే చీరందంలో సంథింగ్ స్పెషల్ గా హైలైట్ అవ్వడం రుహానీ ప్రత్యేకత అని చెప్పాలి. అమ్మడి ఇన్ స్టా చెక్ చేస్తే సారీ భంగిమలు కుప్పలుగా దర్శనమిస్తాయి. రంగు రంగుల చీరలో..లంగావోణీలో హొయలు పోయిన తీరు చూస్తే మతి పోవాల్సిందే. తాజాగా మరోసారి చీరందంలో వ్వాటే బ్యూటీ అనిపించింది. నలుపు వర్ణం చీర.. రవికలో అమ్మడు తనలో బ్యూటీని మరోసారి హైలైట్ చేసింది. క్లోజప్ షాట్ లో రుహానీ హాట్ ట్రీట్ కి పడిపోవాల్సిందే. మత్తెక్కించే చూపులతో హృదయాల్ని కోసేస్తుంది. అమ్మడి ముస్తాబైన విధానం..నెక్ పై అందమైన నెక్లెస్ తో మరింత అందంగా కనిపిస్తుంది. క్లీవేజ్ బ్యూటీతో కాకలే రేపుతుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అభిమానులు అంతే ధీటుగా హాట్ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.



# యానిమల్ బ్యూటీ నేచురల్ హొయలు

'యానిమల్' రిలీజ్ తర్వాత జోయా గురించే ఎక్కువగా చర్చ సాగింది. ఈ పాత్రలో తనదైన అందం అద్భుత నట ప్రదర్శనతో ఆకట్టుకుంది ట్రిప్తి దిమ్రీ. యానిమల్ చిత్రంలో జోయా పాత్రలో జీవించింది. రణబీర్ తో రొమాన్స్ ని తెరపై అద్భుతంగా పండించింది. ఓవైపు నేషనల్ క్రష్ రష్మిక రణబీర్ భార్య పాత్రలో మైండ్ బ్లోయింగ్ పెర్ఫామెన్స్ తో కట్టి పడేస్తున్నా.. సినిమా మధ్యలో ఎంటరైన జోయా పాత్ర కుర్రకారు గుండెల్ని మరిగించింది అంటే అతిశయోక్తి కాదు. కారణం ఏదైనా కానీ ఇప్పుడు ట్రిప్తి దిమ్రీ మోస్ట్ ప్రామిస్సింగ్ పెర్ఫామర్ గా వెలిగిపోతోంది. వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో అవకాశాలకు ఇది దారి తీసింది. ట్రిప్తి అనూహ్యంగా నేషనల్ క్రష్ గా అవతరించింది. ఇప్పుడు ఆ ఫేమ్ ని నిలబెట్టుకునేందుకు తనవంతు ప్రయత్నాల్లో ఉంది. సోషల్ మీడియాల్లో ఈ బ్యూటీ నిరంతరం అభిమానులకు టచ్ లో ఉంటోంది. ట్రిప్తి తాజాగా షేర్ చేసిన హాట్ ఫోటోషూట్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. నేచురల్ బ్యూటీ ఎంతో వేడిగా ఉందంటూ ఈ ఫోటోలకు ప్రశంసలు కురు-స్తున్నాయి. ఎండలో తడిసిముద్దయ్యాను..! అంటూ దీనికి ట్రిప్తి అద్భుతమైన క్యాప్షన్ ఇచ్చింది. నిజానికి ట్రిప్తి ఎంతో నేచురల్ గా కనిపిస్తున్న ఈ ఫోటోగ్రాఫ్స్ ని పరిశీలిస్తే.. తనపై సన్నని సూర్య కాంతి పడుతుంటే చెమటలతో తడిసిపోయి కనిపిస్తోంది. అందుకే ఈ లుక్ సంథింగ్ స్పెషల్ గా ఎలివేట్ అవుతోంది.

కెరీర్ మ్యాటర్ కి వస్తే.. విక్కీ కౌశల్, అమ్మీ విర్క్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'బాడ్ న్యూజ్' చిత్రంలో ట్రిప్తి దిమ్రీ వేడెక్కించే పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే విడుదలై ఆకట్టుకున్నాయి. విడుదల తేదీని ఇంతకుముందే ప్రకటించారు. ట్రిప్తి క్రేజ్ విక్కీ సినిమాకి ప్రధాన ఆయుధంగా మారనుంది. ఆనంద్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నిజఘటనల ఆధారంగా రూపొందుతోంది. అరుదైన వైద్య పరిస్థితి ఆధారంగా ఈ సినిమా కథాంశాన్ని రూపొందించారని తెలుస్తోంది.



# అలాంటి సీన్లకు నో చెబితే ఇంట్లో కూచోవాలి: మృణాల్

సీతారామం- హాయ్ నాన్న - ది ఫ్యామిలీ స్టార్ చిత్రాల్లో నటించింది మృణాల్ ఠాకూర్. వరుస చిత్రాల్లో తనదైన అద్భుత నటనతో మెప్పించింది. ది ఫ్యామిలీ స్టార్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అంతగా ఆడకపోయినా నటిగా తనకు పేరొచ్చింది. ఈ వారం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం స్ట్రీమింగ్ మొదలైంది. తాజా ఇంటర్వ్యూలో ఈ ప్రతిభావంతురాలైన బ్యూటీ తన సినిమాలు, జీవితం, కెరీర్ గురించి చాలా నిక్కచ్చిగా మాట్లాడింది. తాజా ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ సినిమాల్లో ఇంటిమేట్ సీన్స్ చేయడం వల్ల తనకు ఎదురైన అసౌకర్యం గురించి మాట్లాడింది. అయితే ఆ కారణంగానే తాను సినిమాకు నో చెప్పలేనని గ్రహించానని కూడా తెలిపింది. ముద్దు సన్నివేశాలు, బెడ్ రూమ్ సన్నివేశాలు ఉన్నాయని సినిమాలకు నో చెబితే ఎప్పటికీ అవకాశాలు రావని అంది. సహనటుడితో రొమాంటిక్‌గా సన్నిహితంగా ఉండే సన్నివేశాలు చేయడం నాకు అంత సౌకర్యంగా అనిపించదు. నేను భయపడతాను.. సినిమాకి నో చెబుతాను.. కానీ ఎంతకాలం నో చెప్పగలను? నేను నా తల్లిదండ్రులతో కూర్చుని,.. పాపా నేను ఒక భాగాన్ని కోల్పోలేను.. ఎందుకంటే కొన్నిసార్లు ఆ సీన్స్ చేయాల్సి ఉంటుంది. అది నా ఎంపిక కాదు. నేను సినిమా చేయాలనుకున్నంత మాత్రాన ముద్దు సన్నివేశం ఉండడంతో డ్రాప్ అవ్వాల్సి వచ్చేది. కానీ ఒక నటిగా అన్నిటికీ సిద్ధంగా ఉండాలి. ఎందుకంటే కొన్నిసార్లు అది డిమాండ్ (దృశ్యం). సౌకర్యంగా లేకపోతే దాని గురించి మాట్లాడుతాం.. కానీ నేను దాని కారణంగా సినిమాలను కోల్పోయాను%--% అని మృణాల్ అన్నారు. తాజా ఇంటర్వ్యూలో .. కెరీర్ ప్రారంభంలో ఘాడమైన సన్నిహిత సన్నివేశాలకు తన తల్లిదండ్రులు ఓకే చెప్పేవారు కాదని మృణాల్ వెల్లడించారు. తనకు అలాంటి అవకాశాలు వచ్చినప్పుడు.. తన నిర్ణయానికి తండ్రి మద్దతు ఇవ్వలేదు. అప్పట్లో మృణాల్ తన వృత్తిని, కాలేజీని రెండిటినీ బ్యాలెన్స్ చేసుకోవాల్సి ఉంది. అయితే నటనలో కొనసాగడం వల్ల కళాశాల హాజరుపై ప్రభావం పడింది. కానీ తన తండ్రి %-%సూపర్ 30%-% లాంటి సినిమాలపైనా, నట ప్రదర్శనపై ఎక్కువ దృష్టి పెట్టమని చెప్పారని తెలిపింది. %-%కుంకుమ్ భాగ్య%-% అనే టీవీ షోతో మృణాల్ పాపులారిటీ సంపాదించుకుంది. లవ్ సోనియా, సూపర్ 30, ధమాకా, జెర్సీ, సీతా రామం సహా వరుస చిత్రాలతో మరింత పాపులర్ అయ్యింది. విజయ్ దేవరకొండతో కలిసి ది ఫ్యామిలీ స్టార్‌లో కనిపించిన మృణాల్ ఠాకూర్ 2024లో మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. %-%పూజా మేరీ జాన్%-% అనే హిందీ చిత్రంలో మృణాల్ నటించింది. నవజ్యోత్ గులాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హుమా ఖురేషి, విక్రమ్ సింగ్ చౌహాన్, విజయ్ రాజ్ తదితరులు నటించారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986